

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
బుధవారం 20 ఆగస్టు 2025



పల్లె ఓటరు జాబితా రెడీ..



- వార్డుల వారీగా ఓటర్ల విభజన
- గ్రామ యూనిట్ జాబితాలు సిద్ధం
- ఒకే వార్డులో ఒకే కుటుంబం ఓటర్లు
- గత జనవరి ఓటరు జాబితా ప్రకారం మార్పులు
- టీ-పోల్ పోర్టల్‌లో జాబితాలు అప్‌లోడ్
- స్థానిక సంస్థల ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు
- జిల్లాలో 3.46 లక్షల మంది పల్లె ఓటర్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఏ క్షణంలో 'పల్లె'పోరుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపినా.. ఎన్నికల నిర్వహణకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. సెప్టెంబరు 30లోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు కీలకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. ఎన్నికల కమిషన్ జనవరిలో ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా కొత్త ఓటర్ జాబితాను రూపొందించారు. జిల్లాలో 12 మండలాలు ఉండగా, ఒక్కొక్క గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. దీంతోపాటు గ్రామంలోని ఓటర్లను వార్డుల వారీగా విభజించారు. ఒక వార్డులో ఒక కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒక చోట ఉండే విధంగా వార్డు జాబితాలు తయారు చేశారు. టీ-పోల్ పోర్టల్‌లో జాబితాలను అప్‌లోడ్ చేశారు. ఎన్నికల కమిషన్ పబ్లిషింగ్ చేయడానికి జిల్లాలోని పంచాయతీ అధికారులు జాబితాలను సిద్ధం చేయడంతో పాటు ఇతర ఏర్పాట్లపై దృష్టి పెట్టారు.

● జిల్లాలో 260 సర్పంచ్‌లు, 2268 వార్డు స్థానాలకు ఎన్నికలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాల్లో 260 సర్పంచ్, 2268 వార్డు మెంబరు స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ఓటరు జాబితాలు సిద్ధం చేయగా, అధికారులు, సిబ్బందికి మొదటి విడత శిక్షణ పూర్తిచేశారు. 2268 గ్రామపంచాయతీలో ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే బ్యాలెట్‌బాక్సులు సిద్ధంగా ఉంచారు. సర్పంచ్ ఎన్నికలకు పెద్ద బాక్సులు, వార్డు సభ్యులకు చిన్న బ్యాలెట్ బాక్సులు జిల్లాకు వచ్చాయి. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. 2268 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయను న్నారు. జిల్లాలో 200 మంది ఓటర్లు ఉన్నవరకు 1734 పోలింగ్ కేంద్రాలు, 400 ఓటర్ల వరకు 468పోలింగ్ కేంద్రాలు, 650ఓటర్ల వరకు ఉన్న పంచాయతీల్లో 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 650మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. అంతకుమించి ఓటర్లు ఉంటే రెండవ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉన్నచోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201నుంచి400 వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401నుంచి650 వరకు ఉంటే ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. ప్రస్తుతం తయారైన ఓటర్ జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య పెరుగుతుంది. గతంలో ప్రకటించిన జాబితా ప్రకారం జిల్లాలో 260 గ్రామపంచాయతీల పరిధిలో 3 లక్షల 46వేల259 ఓటర్లు ఉన్నట్లు గతంలో లెక్కతేల్చారు. ఇందులో పురుషులు 1,67,686 మంది, మహిళలు 1,78,553మంది ఓటర్లు ఉన్నారు. 20 మంది జెండర్ ఓట్లు ఉన్నాయి. 2019లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం ఈసారి 33వేల765 ఓటర్లు పెరిగారు. గత ఎన్నికల్లో 312,494 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,52,942 మంది ఉండగా ఈసారి 14,744 మంది పెరిగారు. మహిళలు గత ఎన్నికల్లో 1,59,535 ఉండగా ఈసారి 19,018 మంది పెరిగారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళల ఓట్లే కీలకం కానున్నాయి. పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం 3,46,259 మంది ఓటర్లు ఉండగా, ఇందులో.. - మిగతా 8లో

పంటలకు సరిపడా యూరియా నిల్వ..

- రైతులు ఆందోళన చెందవద్దు - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



వ్యవసాయాధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, పంటలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. పంటలను సాగు చేసిన రైతులు యాజమాన్య పద్ధతులతోనే యూరియాను వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం జిల్లాలోని వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించి రైతులు సాగుచేసిన పంటల విస్తీర్ణం, యూరియా నిల్వలు, విక్రయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అయా పంటల సాగుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు యూరియా స్టాక్‌ను తెప్పిస్తున్నామని స్పష్టం చేశారు.యూరియా విషయమై రైతులు అందోళన చెందవద్దని సూచించారు. వ్యవసాయా శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తమ మండలాలకు వచ్చే ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులను అందించాలన్నారు. రైతులు తమకు అవసరమైన ఎరువులు మాత్రమే తీసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్క దారి పట్టకుండా చూడాలని అన్నారు. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి ఎరువులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి అగ్గిపెట్టేలో ఇమిడే పట్టుచీర

- బహూకరించిన చేనేత కార్మికుడు నల్ల విజయ్



చీరను చూపుతున్న ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీరను ఓ భక్తుడు బహూకరించాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్ తాను నేచిన చీరను అందజేశారు. తన కుటుంబం ప్రతి సంవత్సరం అమ్మవారికి అగ్గిపెట్టెలో ఇమిడే చీరను బహూకరిస్తుండటంతో ఈ సంవత్సరం అమ్మవారికి పట్టుచీరను తయారుచేసి ఈవో రాధాబాయికి అందజేశారు. చేనేత కార్మికుడు నల్ల విజయ్‌ను ఆలయ ఈవో రాధాబాయి అభినందించి సన్మానించారు.

పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, అల్మాస్‌పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మోదీ కానుక కింద సమకూర్చిన సైకిళ్లను బీజేపీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, కార్యదర్శి రజిత, పాఠశాలల హెచ్‌ఎంలు, నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ..

- మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- అన్నపూర్ణ ప్రాజెక్టులోకి 3300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మహారాష్ట్రతో పాటు నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలో భారీవర్షాలు పడుతుండడంతో వరదనీరు జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. అయితే అల్పపీడన ప్రభావంతో పొరుగు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో వస్తున్న వరద నీరే రాజన్న సిరిసిల్ల జిల్లాను మురిపిస్తోంది. ఇతర జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నా జిల్లాలో మోస్తరు, ముసురు వర్షంతోనే వరుణుడు సరిపెడుతున్నాడు. సాధారణ వర్షపాతం పరిస్థితులే జిల్లాలో కొనసాగు తున్నాయి. కొన్ని మండలాల్లో లోటు వర్షపాతం ఉంది.

మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

నిజాం కాలంలో నిర్మించిన జిల్లాలోని గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో మత్తడి దూకుతోంది. ఎగువ మానేరు ప్రాజెక్టులోకి సిద్దిపేట జిల్లా నుంచి కూడెల్లివాగు, కామారెడ్డి జిల్లా నుంచి పాల్వంచ వాగుల నుంచి వరదనీరు రావడంతో ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. ప్రాజెక్టు 2 టీఎంసీల సామర్థ్యానికి మించి వరద నీరు చేరడంతో మత్తడి ద్వారా సిరిసిల్ల మానేరు వాగు నుంచి వరదనీరు మిడ్ మానేరు ప్రాజెక్టులోకి చేరుతోంది. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ 27.55 టీఎంసీల సామర్థ్యానికి 13.306 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మిగులు జలాలు వరద కాలువ నుంచి 9700 క్యూసెక్కులు వస్తుండగా, ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల 6300 క్యూసెక్కుల నీరు మిడ్‌మానేరులోకి చేరుతోంది. సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగుల నుంచి 1400 క్యూసెక్‌లతో ప్రాజెక్టులోకి 17400 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టుకు 3300 క్యూసెక్కుల నీరు వదిలారు. అన్నపూర్ణ నుంచి రంగనాయక సాగర్‌కు నీటిని ఎత్తిపోస్తున్నారు.

జిల్లాలో 4.4 మిల్లీమీటర్ల వర్షపాతం..

జిల్లాలో మంగళవారం ఉదయం వరకు 4.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని వీర్నపల్లిలో 6.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వేములవాడ రూరల్ మండలంలో 6.4 మిల్లీమీటర్లు, బోయినపల్లిలో 5.0 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 4.8 మిల్లీమీటర్లు, వేములవాడలో 4.4 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 4.4 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 4.3మిల్లీమీటర్లు, చందుర్తిలో 4.1 మిల్లీమీటర్లు, తంగళ్ళపల్లిలో 3.9 మిల్లీమీటర్లు ఇల్లంతకుంట మండలంలో 3.5 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 3.3 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 3.1 మిల్లీమీటర్లు, గంభీరావుపేటలో 2.7మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

యూరియా కొరతపై కేంద్ర మంత్రులు స్పందించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణపెల్లి మల్లేశం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం నుంచి యూరియా తెలంగాణ రాష్ట్రానికి రాకుండా జరుగుతున్న కొరతపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణపెల్లి మల్లేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో వ్యసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సరిపడే యూరియా పంపకపోవడం వల్లే యూరియా కొరత ఏర్పడి రైతాంగంకు తీవ్రమైన నష్టం జరుగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో ఆ ప్రభుత్వాలకు చెడ్డపేరు తీసుకురావడం కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యూరియాను అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతాంగానికి యూరియా కొరత సృష్టించడం బీజేపీ విధానాలకే చెల్లుతుందని మరోసారి తేటతెల్లమైందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా రైతాంగం హక్కులను హరించి ఆదానీ అంబానీ కార్పోరేట్‌లకు కట్టబెట్టాలని ఆలోచనతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలకు పూనుకుంటుందని విమర్శించారు. దేశంలోని రైతాంగాన్ని ఉద్దరిస్తామని చెప్పుకుంటున్న నరేంద్రమోది అన్ని రకాల సబ్సిడీలను రైతులకు అందిస్తామని ఆచరణలో మాత్రం రైతుల నోట్లో మట్టి కొడుతున్నాడని ఆరోపించారు. ఆదానీ అంబానీలకు రైతాంగ హక్కులను తాకట్టు పెట్టే విధంగా ఆలోచనలు చేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా తమ విధానాలను మార్చుకోవాలన్నారు. తెలంగాణ రైతాంగానికి సరిపడే యూరియాను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీసుకురాకపోతే వారికి వ్యతిరేకంగా రైతులకు మద్దతుగా రైతాంగ ఉద్యమాలను నిర్మిస్తామని హెచ్చరించారు. రైతాంగాన్ని ఆదుకోకపోతే కేంద్ర మంత్రులు ఇద్దరిని గ్రామాల్లో తిరగనివ్వమన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



మండేపల్లిలో క్యూలైన్‌లో పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డులు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

యూరియా కోసం రైతుల ఇబ్బందులు..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం అన్నదాతలకు అగచాట్లు తప్పడంలేదు. యూరియా కోసం వీర్నపల్లి మండలం కంచర్లలో రైతులు మంగళవారం వానలోనూ పడిగాపులు కాయాల్సి వచ్చింది. తోపులాట చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. గంటల తరబడి తడుస్తూ నిలబడితే ఒక్క బస్తా మాత్రమే లభించిందని రైతులు వాపోతున్నారు. తమకు యూరియాను అందించి ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నారు.

● తంగళ్లపల్లి : రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మంగళవారం మండలంలోని మండేపల్లి ప్యాక్స్ గోదాం వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు. తెల్లవారు జామునుంచి యూరియా కోసం రైతులు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను క్యూలైన్‌లో ఉంచారు. గోదాంలో రైతులకు సరిపడా యూరియా లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. గోదాంలో కేవలం 250 యూరియా బస్తాలు ఉండగా భారీగా రైతులు బారులు తీరారు. పోలీసులు చేరుకొని వరుస క్రమంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. కాగా, రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న విమర్శించారు. విషయం తెలుసుకున్న రాజన్నతో పాటు బీఆర్ఎస్ నాయకులు ప్యాక్స్ గోదాం వద్దకు చేరుకుని రైతులకు మద్దతు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సరిపడా యూరియా బస్తాలు అందించాలని డిమాండ్ చేశారు.



కంచర్లలో గొడుగులు పట్టుకుని నిలబడిన రైతులు

అవార్డు గ్రహీతలను అభినందించిన కలెక్టర్



మండల సమాఖ్య సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య సభ్యులు ఆత్మనిర్భర్ సంఘతన్ అవార్డును తీసుకోవడం హర్షణీయమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. అవార్డును ఈనెల 14న కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ల నుంచి ఇల్లంతకుంట మండల అదర్శ సమాఖ్యసభ్యులు స్వీకరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య సభ్యులు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లంతకుంట మండల అదర్శ మహిళా సమాఖ్య బ్యాంక్ రుణాల అందజేత, రికవరీ, క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, సామాజికఅవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం హర్షణీయమన్నారు. మహిళా సంఘాలకు ఇలాగే సేవలందిస్తూ మహిళలందరు ఆర్థికంగా రాణించేలా సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో జిల్లా వైద్యాధికారి తనిఖీ



కాలనీ ప్రజలకు సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

తంగళ్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో జిల్లా వైద్యాధికారి రజిత తనిఖీ చేశారు. మంగళవారం కేసీఆర్‌నగర్‌తో పాటు గ్రామంలోని పలు కాలనీలను కాలినడకగా తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి నిల్వలు ఉండే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో నిత్యం డ్రైడే నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే చేసి జ్వరం వచ్చిన వారిని గుర్తించి చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, రాపిడ్ రెస్పాన్స్ టీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్పీ మహేష్ బి.గితే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులో సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా ఉంటూ వాహనాలను తనిఖీ చేస్తారన్నారు. యూరియా అక్రమ రవాణా చేసేవారిని పట్టుకుంటామన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా యూరియా పంపిణీకేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. యూరియా ఎరువులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటుచేశామన్నారు. ఎరువుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఫోరెన్సిక్ పరీక్షలపై అవగాహన తప్పనిసరి..

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫోరెన్సిక్ పరీక్షలపై అవగాహన తప్పనిసరి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ అన్నారు. సిరిసిల్ల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో హైదరాబాద్ ప్రోట్ ఫోరెన్సిక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మోహన్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పాలిగ్రాఫిక్ టెస్ట్, ఫింగర్‌ప్రింట్ టెస్ట్, నార్కో అనాలసిస్ టెస్ట్, లైవ్‌డిటెక్టర్ టెస్ట్, సంతకం పరిశీలనపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ పి లక్ష్మణ చారి, సిరిసిల్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ పెద్ద చెరువుకు జలకళ

ముస్తాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ పెద్ద చెరువుకు జలకళ సంతరించుకుంది. వరుసగా కురుస్తున్న వర్షాలతో పెద్దచెరువు ఉప్పొంగి మత్తడి దూకుతోంది. ముస్తాబాద్ పట్టణ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ డీఈ రవీందర్, ఏఈ శ్రీకాంత్‌లు చెరువును పరిశీలించారు. నీరు వృథాగా పోకుండా తూముల ద్వారా నీటిని విడిచి కిందివైపు చెరువులను నింపేలా చూస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని పలు చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది.



సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి

అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి
చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు
మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.

పత్రిక పంపిణీలో మీకు ఏమైనా అసౌకర్యం
ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు
మా సిబ్బంది సదా మీ సేవకు సిద్దంగా ఉంటారు

రాజన్న సిరిసిల్ల : 99125 54500
63014 67273
ACM : 99854 11274

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

భార్యపై క్రికెట్ బ్యాట్‌తో దాడి

చందుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్యపై భర్త క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం రామరావుపల్లె గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సంపత్ అనేవ్యక్తి కుటుంబ కలహాలతో భార్య లహరిపై క్రికెట్ బ్యాటుతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై చందుర్తి ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి గ్రామశివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నల్లగొండ గ్రామంలో..

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నల్లగొండ గ్రామంలో మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ట్రాక్టర్‌ను ఎల్ ఎండీ పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. కొత్తపల్లికి చెందిన చిట్యాల నరేష్‌తో పాటు కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుర్ర లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంథనిలో చోరీ

మంథని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రావుల చెరువుకట్టలో రాంపెల్లి ఆనంద్ ఇంట్లో చోరీ జరిగినట్లు స్థానికులు సోమవారం రాత్రి గుర్తించారు. ఆనంద్ కొద్ది రోజులుగా వరంగల్ ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూం, బీరువాలో సామగ్రి చిందవందర చేశారు. ఇంట్లో ఏమేమి చోరీ జరిగిందో తెలియలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించారు.

దుకాణంలో చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కాన్పుర ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి ఒక శానిటరీ షాపులో దొంగతనం జరిగింది. ఎండీ షకీల్ కాన్పురలోని పెద్దపల్లి రోడ్‌లో షకీల్ శానిటరీ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాపు తాళంవేసి ఎప్పటి మాదిరిగానే ఇంటికి వెళ్లాడు. మంగళవారం షకీల్ దుకాణం తెరిందుకు రాగా షటర్ తాళం పగులగొట్టి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లిచూడగా కౌంటర్‌లో డబ్బులు కనపడలేదు. కౌంటర్‌లో ఉన్న దాదాపు 20 వేల రూపాయలు గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారని బాధితుడు షకీల్ కరీంనగర్ మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



పని బంగారం బతుకు నిస్సారం

- పెరుగుతున్న ధరలతో తగ్గిన పని
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కార్పొరేట్ జ్యూవెల్లరీలు
- చితికిపోతున్న స్వర్ణకారుల జీవితాలు
- బతుకుదెరువు కోసం ఇతర రంగాల బాట

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కులవృత్తులు రోజురోజుకూ ఉనికిని కోల్పోతున్నాయి. చేసేది లేక కొందరు బతుకు దారి మార్చుకుంటున్నారు. మరి కొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వంగా స్వీకరించి స్వర్ణకార వృత్తినే నమ్ముకుని అవస్థలు పడుతున్నారు. పని బంగారం.. కానీ బతుకు నిస్సారంగా మారిందని స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లో శుభకార్యం తలపెడితే ముందుగా గుర్తుకు వచ్చేది బంగారం దుకాణమే. వివాహవేడుకలకు బంగారానికి ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. మహిళలు అందంగా, హుందాగా కనిపించాలని బంగారు ఆభరణాలు ధరిస్తారు. బంగారు ఆభరణాలు తయారు చేయాలంటే దాని వెనుక పెద్ద కష్టమే ఉంటుంది.

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 10 నుంచి 20 వేలకు పైగా స్వర్ణకార కుటుంబాలు ఉన్నాయి. బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయడం లేదు. దీంతో స్వర్ణకారులు పని దొరకక దుకాణాల అద్దెలు కూడా చెల్లించలేక పోతున్నారు. కుటుంబ పోషణ భారమై ఇతర రంగాల్లో పని చేస్తున్నారు. మరో వైపు ఆభరణాల రంగంలో కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపులు పెద్ద ఎత్తున వెలవడంతో పాటు వాయిదాల పద్ధతిలో బంగారు ఆభరణాలు విక్రయిస్తుండడంతో వినియోగదారులు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతు న్నారు. కార్పొరేట్ వ్యవస్థ కారణంగా స్వర్ణకారులు వృత్తి పనులు కోల్పోతున్నారు.

కూలీలుగా మారుతున్న స్వర్ణకారులు

పెరుగుతున్న బంగారం, వెండి ధరల కారణంగా, సర్వం యంత్రాలమయం కావడంతో స్వర్ణకారులకు చేతినిండా పని లేకుండా పోయింది. దీంతో కొందరు పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక బ్యాంకుల్లో అప్రయిజర్లుగా చేరిపోయారు. బతుకు బండిని లాగేందుకు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో గుమస్తాలుగా చేరుతున్నారు. మరికొంతమంది భవన నిర్మాణ కార్మిక రంగంలో కూలీలుగా మారి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంకొంత మంది ఇడ్లీ, టీ బండ్లను నడుపుకుంటున్నారు. ఇక ఇతర వృత్తుల్లోకి వెళ్లడం ఇష్టంలేని మరికొంత మంది స్వర్ణకారులు రాగి, ఇత్తడి, పంచలోహ తాయిత్తులు, ఇతర చిన్న చిన్న వస్తువులను తయారు చేస్తూ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం స్వర్ణకార వృత్తి చేస్తున్న వారెవరూ కూడా వారి పిల్లలకు ఈ వృత్తిని నేర్పించడానికి ఇష్టపడటం లేదు. ప్రభుత్వం ఇతర చేతి వృత్తుల వారికి ఇచ్చిన మాదిరిగా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.



ప్రభుత్వం ఆదుకోవాలి



కట్ట జగన్, జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి

ధరల హెచ్చుతగ్గులు, కార్పొరేట్ జ్యూవెల్లరీ దుకాణాలతో వృత్తిని నమ్ముకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారికి కొంతమేరకు వ్యాపారాలు నడుస్తున్నాయి. ఆర్థికంగా లేని స్వర్ణకారులు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో గుమస్తాలుగా చేరుతున్నారు. మరికొంత మంది వెల్డింగ్ షాపుల్లో, భవన నిర్మాణ రంగంలో కూలీలుగా మారారు. ప్రభుత్వాలు స్పందించి వడ్డీ లేకుండా రూ.10లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలి.

చేతినిండా పనిలేకుండా పోయింది



శ్రీరామోజు రవీంద్రాచారి, స్వర్ణకారుడు

పండుగలతో పాటు వివాహాది శుభ ముహూర్తాలు ఉంటే చేతి నిండా పని ఉండేది. మార్కెట్లోకి కార్పొరేట్ జ్యూవెలర్స్ రావడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కనీసం చిన్న చిన్న పనులు కూడా రావడం లేదు. ప్రభుత్వం గుర్తించి నిరుపేద స్వర్ణకారులను ఆదుకోవాలి. ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయి.

ఇతర పనులు చేస్తున్నాం..

కనపర్తి సత్యనారాయణ, స్వర్ణకారుడు



బంగారం ధరలు విపరీతంగా పెరగడం, మార్కెట్లో కార్పొరేట్ జ్యూవెలరీ షాపులు విరివిగా వెలుస్తుండ డంతో బంగారం, వెండి పనిచేసేవారికి చేతి నిండా పనిలేకుండా పోయింది. కొన్ని దుకాణాల్లో వాయిదాల పద్ధతిన ఆభరణాలు విక్రయిస్తున్నందున వినియోగ దారులు అటువైపే వెళ్తున్నా రు. పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక, ఇతర రంగంలో పనులు చేయడం ఇష్టంలేక, పంచలోహ ఉంగరాలు చేస్తూ కుటుంబాలు వెళ్లదీసుకుంటున్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

- ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ట్రాలీ సీజ్
- రూ.4 లక్షల జరిమానా

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల ఇన్‌చార్జి డీటీవో వంశీధర్ హెచ్చరించారు. వీర్నపల్లి మండల కేంద్రం పరిధిలోని ప్రధాన రహదారిపై మంగళవారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాలను ఆపి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సామర్థ్యానికి మించి ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోవాలలపై కొరడా ఝుళిపించారు. వాహన పన్ను చెల్లింపునకు నెల రోజులు గడువు ఇచ్చినా డబ్బులు కట్టని వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడపకూడదని పేర్కొన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా ప్రయాణీస్తున్న సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ట్రాలీని సీజ్‌చేసి రూ.4లక్షల జరిమానా విధించామని ఇన్‌చార్జి డీటీవో వంశీధర్ పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీటీవో వంశీధర్

సహకార బ్యాంక్‌లో మోగిన సైరన్

- అప్రమత్తమైన పోలీసులు

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో పోలీస్ స్టేషన్ వెనుక సహకారబ్యాంక్ ఉంది. మంగళవారం తెల్లవారుఝామున ఒక్కసారిగా బ్యాంక్ నుంచి హారన్ వినిపించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. సైరన్ అలా ఆగకుండా మోగుతూనే ఉండడం, బ్యాంకు షట్టర్లు తెరిచి ఉండడంతో అయోమయానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. బ్యాంకు మేనేజర్ శశికాంత్‌ను వివరణ అడుగగా తెల్లవారుఝామున బ్యాంకును శుభ్రం చేసేందుకు వచ్చిన వ్యక్తి ఆటోమోటిక్ ఆలారం సైరన్ సిస్టమ్‌ను అన్‌లాక్ చేయక షట్టర్లు తీసి లోపలకు రావడంతో ఆటోమేటిక్ సైరన్ మోగిందన్నారు. కొంత సేపటి తర్వాత ఫోన్ ద్వారా సైరన్‌ను అన్‌లాక్ చేయడంతో హారన్ ఆగిపోయిందన్నారు.

వినాయకుడి విగ్రహాన్ని తీసుకువస్తుండగా విషాదం..
విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



లక్ష్మీనారాయణ(ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గణపతి విగ్రహాన్ని తీసుకు వస్తుండగా విద్యుదాఘాతంతో కొమ్ము లక్ష్మీనారాయణ (19) అనేయువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక యువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన వీబీవీయూత్ ఆధ్వర్యంలో 12మంది యువకులు గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చేందుకు ఆదివారం నిజామా బాద్ జిల్లా పెర్కిట్‌కు వెళ్లారు. పెర్కిట్ నుంచి 20అడుగుల గణేష్ విగ్రహాన్ని వాహనంపై తీసుకు వస్తుండగా మంగళవారం ఉదయం కామారెడ్డి జిల్లాలోని ఆరెపల్లి శివారులో 11కేవీ విద్యుత్‌వైరు తగిలి లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము నవీన-మైసయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒకకూతురు ఉన్నారు. వీరు ఉపాధికోసం సిరిసిల్లకు వలసవచ్చారు. పెద్దకొడుకు లక్ష్మీనారాయణ మృతితో కుటుంబంలో విషాదం అలుముకుంది. మరోయువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు లక్ష్మీనారాయణకు సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్క లేదు. లక్ష్మీనారాయణ సాయంత్రం పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటామని స్నేహితులకు చెప్పుకుంటూ ఇంటికి వస్తుండగా విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రగాయాలైన సాయికి స్థానికులు సీపీఆర్ చేసి కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మిగతా 10మంది యువకులు వాహనంపై ముందు ఉండటంతో భారీప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆసుపత్రికి తరలివెళ్లారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణ్(ఫైల్)

ఓదెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపులలో మంగళ వారం ఊరగొండ లక్ష్మణ్(42) అనేవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. లక్ష్మణ్ భార్య విడాకులు తీసుకొని పుట్టింటికి వెళ్లడంతో అతడు అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు తీవ్రగాయాలై చికిత్సపొందాడు. ఆరోగ్యం కుదుటపడడంతో పొత్కపల్లిలోని పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడు. అయితే మద్యానికి బానిస కావడంతో తల్లి మందలించింది. దీంతో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్‌రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఊరగొండ మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ కూరగాయల మార్కెట్, వెంకటేశ్వర టెంపుల్ సమీపంలో మంగళవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి(50) పడుకొని వర్షంలో తడుస్తూ వణుకుతూ స్థానికులకు కనిపించాడు. ఉదయం 9:30గంటలకు డయల్ 100ద్వారా సమాచారం తెలుసుకున్న కరీంనగర్ ఒకటోటౌన్ పోలీసులు సదరు వ్యక్తిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడచికిత్సపొందుతూ ఉదయం 10:30గంటలకు మృతి చెందాడు. మృతుడు ఎరుపు, నల్లనిగీతలు కలిగిన టీషర్టు, నలుపు రంగు పాయింటు ధరించిఉన్నాడని మృతదేహాన్ని ప్రభుత్వఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించినా, ఆచూకీ తెలిసిన వారు వెంటనే కరీంనగర్ ఒకటో టౌన్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఒడ్డెపల్లి క్రాసింగ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మందమర్రి మండలం క్యాతన్‌పల్లికి చెందిన వృద్ధురాలు జడ బక్కవ్వ(80) మృతి చెందిందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. బక్కవ్వతోపాటు ఆమె మనమరాలు మౌనిక మంగళవారం కరీంనగర్‌కు వచ్చి ఒక ఆటోలో బావుపేటకు వెలుతున్నారు. ఈ క్రమంలో ఒడ్డెపల్లి క్రాసింగ్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న బక్కవ్వతోపాటు మౌనిక, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడినవారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బక్కవ్వ మార్గమధ్యలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

ఈత, తాటి చెట్ల ధ్వంసంపై ఎక్సైజ్ అధికారుల పరిశీలన

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని మానేరు వాగు సమీపంలో ఉన్న తాటి, ఈత వనాన్ని కొందరు ధ్వంసం చేశారంటూ గౌడసంఘం నేతల ఫిర్యాదు మేరకు మంగళవారం సుల్తానాబాద్ ఎక్సైజ్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గీత కార్మికులు మాట్లాడుతూ భూమి యజమానులు కొందరు భూములను చదును చేసే క్రమంలో తమకు ఉపాధినిచ్చే తాటి, ఈత చెట్లను కూడా ధ్వంసం చేశారని అధికారులకు వివరించారు. పూర్తి వివరాలు నమోదు చేసుకున్న ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టారు.

జగిత్యాలలో విషాదం

- మహారాష్ట్ర వరదలో గల్లంతైన ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యం



హసీనా(ఫైల్)



సమీనా(ఫైల్)

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో వరదఉధృతికి కొట్టుకుపోయిన ఇద్దరు మహిళల మృతదేహాలు మంగళవారం లభ్యమవడంతో వారి స్వస్థలమైన జగిత్యాల జిల్లా కేంద్రంలో విషాదం నెలకొంది. నాందేడ్ జిల్లా దెగ్లూర్ సమీపంలోని రావి గ్రామంవద్ద వరదఉధృతికి ఆదివారం జగిత్యాలకు చెందిన ముగ్గురు మహిళలు గల్లంతు కాగా వారిలో మంగళవారం హసీనా(36), సమీనా(50) అనే మహిళల మృతదేహాలు లభ్యమయ్యాయి. జిల్లాకేంద్రంలోని తారకరామనగర్ కాలనీకి చెందిన ముగ్గురు మహిళలు వారి బంధువైన షోయబ్‌తోకలిసి మహారాష్ట్రలోని ఉద్గీర్‌లో ఓ శుభకార్యానికి వెళ్లారు. అనంతరం తిరుగుప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు వరదల్లో గల్లంతు కాగా స్థానికులతోపాటు బాధిత కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం వరద ఉధృతి తగ్గడంతో రావి గ్రామంవద్ద గల్లంతైన కారు 24కిలోమీటర్ల దూరంలోని ముక్రంబాద్ అనే గ్రామం సమీపంలోని బ్రిడ్జికింద పంటపొలాల్లోని బురదలో చిక్కుకున్నట్లు గుర్తించారు. మరికొంత దూరంలో చెట్లపొదల మధ్య హసీనా, సమీనాల మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మరో మహిళ ఆఫ్రీన్‌కు చెందిన చీరతో పాటు బురఖా కారు వద్ద లభ్యమయ్యాయి.

త్రుటిలో తప్పించుకున్నా..

- ప్రమాదం నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షి షోయబ్



షోయబ్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వరదలో కారుతోసహా కొట్టుకుపోగా ఆటోడ్రైవర్, కారు డ్రైవర్‌తోపాటు తాను త్రుటిలో తప్పించుకున్నానని ప్రమాదంనుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షి షోయబ్ తెలిపాడు. మహారాష్ట్రలో వరదలో కొట్టుకుపోయిన మహిళల మృతదేహాల కోసం వెతుకుతున్న తారకరామనగర్ వాసులతో ఉన్న షోయబ్‌ను ఫోన్‌లో పలకరించగా ఆదివారం రాత్రి జరిగిన సంఘటనను వివరించాడు. ఆదివారం అర్ధరాత్రి తనబంధువులైన హసీనా, ఆఫ్రిన్, సమీనాలతో కలిసి ఆటోలో ఉద్గిర్ నుంచి బయలుదేరామని తెలిపాడు. ఉద్గీర్‌నుంచి ఆటోలో కొంతదూరం వచ్చాక ముక్తేడ్ తాలూకా దెగ్లూర్‌కు కొంచెందూరంలో మేమువెళ్తున్న రోడ్డుపై నీరు ప్రవహించడం ఆటో డ్రైవర్ గమనించాడన్నాడు. దీంతో వెంటనే డ్రైవర్ ఆటోను వెనక్కుతిప్పే ప్రయత్నం చేశాడని తెలిపాడు. అప్పటికే వెనకవైపు కూడా నీరుచేరడంతో ఆటో నీటిని దాటివెళ్లలేక పోయిందన్నారు. దీంతో మా ముందున్న కారులో హసీనా,ఆఫ్రిన్,సమీనాతోపాటు ఆటోడ్రైవర్, కారుడ్రైవర్ కూర్చున్నామన్నారు. కొద్దిసేపటికే కారులోకి నీరురావడంతో కాపాడాల్సిందిగా కేకలు వేశామన్నారు. అర్ధరాత్రికావడంతో ఎవరూ ఆ పరిసరాల్లో కనిపించలేదన్నారు. అయితే తాము కొట్టుకుపోవడం ఖాయమని తెలియగానే ఆఫ్రిన్ ఇంటికి ఫోన్‌చేసి తమ పరిస్థితిని వివరించిందన్నారు. అదే సమయంలో కారుతోసహా తాము నీటిలో కొట్టుకు పోయాయని షోయబ్ తెలిపాడు. ఆటోడ్రైవర్, కారు డ్రైవర్‌తోపాటు తానుకొంచెం దూరంలో చెట్టును పట్టుకొని బయటపడ్డామని షోయబ్ పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

గంగాధర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల16న గంగాధర గ్రామానికి చెందిన పెగుడ మల్లమ్మ(70)ను గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వచ్చి నంబరులేని కారులో ఎక్కించుకుని వెళ్లారు. మల్లమ్మ ఆచూకీ లభించక పోవడంతో మరుసటి రోజు ఆమె తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు వృద్ధురాలు కారులో ఎక్కిన దృశ్యాలను గుర్తించారు. కానీ అగంతకులు వృద్ధురాలిని నంబరు ప్లేటు తొలగించిన కారులో తీసు కెళ్లగా పోలీసులకు నిందితులను పట్టుకో వడం సవాలుగా మారింది. అయితే మంగ ళవారం విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఇద్దరు అనుమానితులను అదు పులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమా చారం. కారులో తీసుకెళ్లిన వృద్ధురాలి ఆచూకీ మాత్రం ఇప్పటికీ లభించలేదు. వృద్ధురాలిని తెలిసిన వ్యక్తులే తీసుకెళ్లారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు.

వర్షానికి రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం

జగిత్యాలరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామశివారులోని నిజామాబాద్ రహదారిపై వర్షానికి భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టు రోడ్డుకి అడ్డంగా పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న జగిత్యాలరూరల్ ఎస్సై సదాకర్ తమ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్‌తో వృక్షాన్ని పక్కకు తొలగించారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు.



వృక్షాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఎస్సై సధాకర్

విజిలెన్స్ విచారణపై ఆసక్తి

- మిడ్ మానేరు ప్రాజెక్టులో రూ.224 కోట్ల అక్రమాలపై చర్చ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణ పనులు తొలినాళ్ల నుంచి అనేక అవాంతరాలు, అవినీతి ఆరోపణల మధ్య కొనసాగాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై నిలబడిందనే చర్చలకు మరోసారి ఊతమిస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ నిలిచింది. తాజాగా మిడ్ మానేరు ప్రాజెక్టుపనుల్లో ప్రభుత్వ ఖజానాకు రూ.224కోట్ల మేరకు నష్టం తెచ్చిన అప్పటి ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తన నివేదికను నీటిపారుదల శాఖకు అందజేసినట్లు తెలియడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో చర్చ ప్రజల్లో మొదలైంది.

సీనియర్ ఇంజనీర్ల నుంచి కిందిస్థాయివరకు చర్యలు తీసుకోబోతున్నారా.. విచారణతో కాలయాపన జరుగుతుందా..?, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో ఏర్పడ్డ లోపాలతో అప్పటి ప్రభుత్వ పెద్దలకు మిడ్‌మానేరు అవినీతి ఉచ్చు చుట్టుకుంటుందా.. అనే గుబులు మొదలైంది. విజిలెన్స్ అధికారులు పక్కాగా ఆధారాలు సేకరించారు. అందులో అధికారులపైన క్రిమినల్‌చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఒకరిద్దరు అధికారులు ఇప్పటికే రిటైర్ అయ్యారు.. అయినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందని ప్రభుత్వా నికి సిఫారసు చేయడం అధికారుల్లో ఆందోళన మొదలైంది.

2006లో మిడ్ మానేరు ప్రాజెక్టుకు గండి..

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడవద్ద మానేరు వాగుపై మిడ్‌మానేరు పాజెక్టు 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. రూ.399కోట్లతో జడ్వీఎస్, రత్న, సుశీ జాయింట్ వెంచర్‌దక్కించుకంది. నిర్ణీత సమాయాన్ని దాటి గడువు పొడిగించినప్పటికీ.. పనులను పూర్తి చేయలేకపోవడంతో 2012లో మరోకంపెనీలకు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్న 2015నాటికి అనుకున్నంత స్థాయిలో పనులు కాలేదు. అప్పటికే తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారు ఏర్పడడం, ప్రాజెక్టులపై అప్పటి సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమీక్షల తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ముందుకు తెచ్చారు. మిడ్‌మానేరు రిజర్వాయర్‌ను వాటర్ హబ్‌గా కాళేశ్వరం ప్రాజెక్టులో అతికీలకమైనది ఉపయోగపడేలా డిజైన్ చేశారు. ఇక్కడినుంచే లోయర్ మానేరు డ్యాంకు, రంగనాయక సాగర్ , మల్లన్న సాగర్‌కు, కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించే విధంగా ప్యాకేజీలను రూపొందించారు. 2016లో వేగంగా మిడ్‌మానేరు పనులు పూర్తి చేసి కొంత మేరకు నీటిని నిల్వ ఉంచారు. అదే సమయంలో సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలకు విడమ వైపు కట్టకు గండి పడింది. ఐదు లక్షల క్యూసెక్కులను తట్టుకునేలా నిర్మించిన డ్యాం.. లక్ష క్యూసెక్కులకే కట్టతెగడంతో.. ప్రభుత్వంపై రూ.30 కోట్ల అదనపు భారం పడింది. కుడివైపు స్పిల్‌వే, మట్టికట్ట పని పుణేకు చెందిన యశోదీప్ ఇన్‌ఫ్రాకు అప్పగించారు. ఆ సంస్థ రూ.13 కోట్ల పనులు చేసిన తర్వాత చేతులెత్తేసింది. దీంతో శ్రీరాజరాజేశ్వరి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి రూ.101 కోట్ల పనులను అప్పగించారు. కొత్త కంపెనీలకు పనులను అప్పగించే సమయంలో నిబంధనలను సడలించి.. ధరలను పెంచారు. మరోవైపు కొత్త ధరలను తమకూ వర్తింపజేయాలని జాయింట్ వెంచర్‌లోని మిగతా కంపెనీలు కోరగా.. అందుకు స్టాండింగ్ కమిటీ ఒప్పుకోలేదు. ఇదే సమయంలో ఎడమవైపు మట్టి కట్ట 130 మీటర్ల గండి పడింది. దీంతో అప్పటికే పనులు చేస్తున్న సంస్థను తొలగించి.. ఎడమవైపు పనులకు రూ.347 కోట్లుగా నిర్ధారించి.. పరిపాలన అనుమతులు లేకుండానే టెండర్ పిలిచి.. రాజరాజేశ్వరీ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇచ్చారు. అంచనాలను భారీగా పెంచడంతో ప్రభుత్వానికి రూ 224 కోట్ల నష్టం వాటిల్లింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ప్రాజెక్టు మీద అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. అయినా ఆ ఆరోపణలను బీఆర్ఎస్ పట్టించుకోలేదు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డిని, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి మిడ్ మానేరు ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని ముంపు గ్రామాల అధ్యక్షుడు కూస రవీందర్ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. సంవత్సర కాలంగా అధికారులు విచారణ జరిపి.. నివేదిక అందించారు.



మిడ్ మానేర్ ప్రాజెక్ట్




పరవళ్లు తొక్కుతున్న ఎగువ మానేరు ప్రాజెక్టు

ఎగువ మానేరు పరవళ్లు

అప్రమత్తమైన అధికారులు

గంభీరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నర్మాల ఎగువ మానేరు పూర్తిగా నిండి మత్తడి దూకుతోంది. మొత్తం మానేరు నీటి మట్టం 31 ఫీట్లు ఉండగా, మంగళవారం ఉదయంకల్లా 31 ఫీట్లకు చేరి, మత్తడి దూకుడు మొదలైంది. మానేరు మత్తడి దూకి పరవళ్లు తొక్కుతుండటంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి మానేరు మత్తడి దూకుతుండటంతో తహసీల్దార్ మారుతిరెడ్డి సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు మానేరు డ్యాంతో పాటు మానేరు వాగు పరిసరాలను పర్యవేక్షిస్తున్నారు.



శ్రీరాంసాగర్ వద్ద..

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

39 గేట్లు ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 39 వరద గేట్లు పైకి ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 2,75,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 73.37 టీఎంసీల నీరు ఉంది. వరద కాలువకు 20,000 క్యూ సెక్కులు, కాకతీయ కాలువకు 4,700 క్యూ సెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 636 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 82.683 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 22.026 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.



నిండుగా ప్రవహిస్తున్న వరద కాలువ

గాయత్రి పంప్‌హౌస్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ఇంతవరకు మూడు, నాలుగు పంపుల ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలిస్తున్న అధికారులు ప్రస్తుతం ఎస్సారెస్పీ నీరు వస్తున్న నేపథ్యంలో ఒక్క పంపునకు కుదించారు. రెండు పంపుల ద్వారా 3150క్యూసెక్కుల నీరు పంప్ హౌస్ నుంచి వరద కాలువకు తరలి వెళ్తోంది. అలాగే ఎస్సారెస్పీ నుంచి 15450క్యూసెక్కులు నీరు వరద కాలువలో చేరుతోంది. దీంతో ప్రస్తుతం వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 18 500క్యూసెక్కుల నీరు తరలి వెళుతోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువకు నీటి ప్రవాహం పెరుగుతుండగా రేపటిలోగా ఇక్కడికి నీరు వచ్చే అవకాశం ఉండటంతో పంపులను ఆపివేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీరు తరలి వెళుతుండటంతో వరద కాలువ నిండు కుండలా తయారైంది.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వెళుతున్న నీరు

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు ప్రారంభం

ఇల్లంతకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.08టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని నాలుగో నంబర్ పంపు ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న ప్యాకేజీ 11లోని రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ప్రతాపరెడ్డి తెలిపారు.

తెగిన లింగన్నపేట రోడ్డు



వరద ఉధృతికి తెగిన రోడ్డు

గంభీరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై ఉన్న రోడ్డు మంగళవారం సాయంత్రం తెగిపోయింది. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిగా నిండి, మత్తడి దూకుతోంది. దీంతో మానేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో లింగన్నపేట రోడ్డు తెగింది. వరద ఉధృతితో మానేరు వాగుపై ఉన్న రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎస్ఐ రమాకాంత్ మానేరు పరివాహక ప్రాంతాల పరిస్థితిని పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు. మానేరు డ్యాం, మానేరు వాగు ప్రాంతాల దగ్గర రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ మార్గాల వైపు వాహనాలు, ప్రజలు వెళ్లకుండా చర్యలను చేపట్టారు.

పంచేంద్రియాలకు శిక్షణ

- కస్తూర్బాల్లో 'బ్రైటర్ మైండ్స్' ట్రైనింగ్‌తో అద్భుత ఫలితాలు
- కళ్లకు గంతలు కట్టుకొని రంగులు, చిత్రాలు గుర్తింపు
- అబ్బురపరుస్తున్న విద్యార్థులు



కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తిస్తున్న విద్యార్థినిని అభినందిస్తున్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ (ఫైల్)

సారంగాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రైటర్ మైండ్స్ పేరుతో కస్తుర్బా విద్యాలయాల్లో పంచేంద్రియాలకు శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారు. జగిత్యాల, సారంగాపూర్‌లోని కస్తూర్బా విద్యాలయాల్లో ప్రత్యేక శిక్షణతో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని తమ ముందున్న రంగులను, అక్షరాలను, చిత్రాలను, వ్యక్తులను తేలికగా గుర్తిస్తున్నారు. ఇటీవల సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులు తమ ప్రతిభను ప్రదర్శించి కలెక్టర్ సత్యప్రసాద్‌తో శభాష్ అనిపించుకున్నారు. సారంగాపూర్‌లో గత ఏడాది మార్చి నుంచి విద్యార్థులకు శిక్షణను ప్రారంభించారు.

ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో శిక్షణ

హైదరాబాద్‌లోని శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో కన్హాశాంతి వనం ధ్యానం కేంద్ర నిర్వాహకులు జగిత్యాల, సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయం నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను బ్రైటర్ మైండ్స్ శిక్షణకు ఎంపిక చేశారు. వీరికి రెండు రోజులు పాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. జగిత్యాలకు చెందిన స్వచ్ఛంద సేవకులు మంచాల రామకృష్ణ ఈ శిక్షణకు సంబంధించిన పరికరాలను బహూకరించారు. కస్తూర్బాలో ప్రతి బ్యాచ్‌కు 15 నుంచి 20 మంది విద్యార్థు లు ఈ బ్రైటర్ మైండ్స్ శిక్షణ తీసుకుంటున్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు తొమ్మిది వారాల పాటు శిక్షణ ఇస్తారు.

మెదడుకు ఉత్తేజం

విద్యార్థులకు మోటివేషన్, ప్రసంగం, రిలాక్సేషన్, ప్రాణయామం, ధ్యానం, మెదడు, కళ్లు, వంటి వాటిపై శిక్షణ ఇస్తూ మరో 40 నిమిషాలు సంగీతాన్ని వినిపిస్తూ పడుకోబెడతారు. లేచిన అనంతరం కళ్లకు గంతలు కట్టుకుని శబ్దం, వాసన, స్పర్శ, దృష్టి ద్వారా రంగులను, వస్తువులను, వ్యక్తులను ఎలా గుర్తు పట్టాలో శిక్షణ ఇస్తారు. బ్రైటర్ మైండ్స్ శిక్షణలో ప్రధానంగా మెదడుకు సంబంధించిన వ్యాయామాలు నేర్పించడం ద్వారా పంచేంద్రియాలు చురుగ్గా పనిచేసేలా తర్ఫీదునిస్తారు. దీంతో పంచేంద్రియాలైన కళ్లు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం ఉత్తేజం చెంది బాగా పనిచేస్తాయి. తద్వారా రంగులను, వాసనను, వ్యక్తులను, చిత్రాలను, అక్షరాలను తేలిగ్గా గుర్తించగల్గుతారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దోహదం

వీణ, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేకాధికారి, సారంగాపూర్



ఈ బ్రైటర్ మైండ్స్ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుంది. శిక్షణతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగింది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను త్వరగా నేర్చు కుంటున్నారు. ఈ శిక్షణ ఎంతగానో విద్యార్థులకు దోహదపడుతుంది.

తొమ్మిది వారాలు శిక్షణ

రజిత, బ్రైటర్ మైండ్స్ శిక్షణ ఉపాధ్యాయురాలు



మెదడుకు సంబంధించిన వ్యాయామం ద్వారానే రంగులను, బొమ్మలను, వ్యక్తులను గుర్తించడం సాధ్యమవుతుంది. మేము హైదరాబాద్‌లో రెండు రోజులు శిక్షణ తీసుకొని మా విద్యార్థులకు బ్యాచ్‌ల వారీగా తొమ్మిది వారాల పాటు శిక్షణ ఇస్తున్నాం. కొంత మంది విద్యార్థులు రెండు వారాల శిక్షణలోనే నేర్చుకోగలుగుతున్నారు.

ఏకాగ్రత పెరిగింది

వైష్ణవి, 9వ తరగతి



బ్రైటర్ మైండ్స్ శిక్షణ తీసుకున్న తర్వాత నాలో ఏకాగ్రత పెరిగింది. అప్పటి నుంచి మెదడు మరింత చురుగ్గా పనిచేస్తోంది. ఈ శిక్షణ భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.



ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగులు తీస్తున్న నీరు

సుందిళ్ల బ్యారేజీలోకి చేరుతున్న నీరు

మంథనిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా, పై నుంచి భారీ వరద నీరు రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో మంగళవారం గేట్లు ఎత్తి వేయడంతో సుందిళ్ల బ్యారేజీలోకి 2లక్షల 63 వేల 898 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. అయితే బ్యారేజీలో ఉన్న 74గేట్లు ఎత్తి ఉండటంతో నీరు దిగువ ప్రాంతానికి వదిలి వేశారు. దీంతో గోదావరిలో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది. గోదావరి, మానేరు నదుల నుంచి నీరు దిగువ ప్రాంతానికి భారీ ఎత్తున వెళ్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి భారీగా వరద..

శ్రీపాద ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి 3,67,461 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, దిగువకు 40 గేట్ల ద్వారా 4 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతుండగా, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 6,300 క్యూసెక్కులను 2 పంపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. వరద ప్రవాహం పెరుగుతుండడంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎల్లంపల్లి బ్యారేజీ వద్దకు వెళ్లి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ బ్యారేజీ మీదుగా మంచిర్యాల జిల్లాకు సాగే రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు నీటి పారుదల శాఖాధికారులు ప్రకటించారు.

ఎత్తిపోతలకు కుదింపు...

బోయినపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఒకే పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎస్సారెస్పీ నిండుకుండలా మారడంతో అక్కడి నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో వరద కాలువ ఎస్సారెస్పీ నీటితో పరుగులు పెడుతోంది. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి గాయత్రి పంప్ హౌస్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 17600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రి పంప్ హౌస్ నుంచి 4600 వేలు, ఎస్సారెస్పీ నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 12600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ 3200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు 311.54 మీటర్ల మేరకు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 13.810 టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

ఎస్సారార్‌లో త్వరలో స్పాట్ అడ్మిషన్ల షెడ్యూలు

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో మిగిలిపోయిన సీట్లను స్పాట్ ద్వారా భర్తీ చేయడానికి త్వరలో ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా షెడ్యూలు విడుదల చేయనుందని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్, కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం బిజినెస్ ఎనలిస్టిక్స్, బీకాం ఫైనాన్స్, బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీబీఏ, బి.సి.ఎ, బీఏలో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయని త్వరలో విడుదలయ్యే దోస్త్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ ప్రకారం ఖాళీలను భర్తీ జరుగుతుందని తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి చివరి అవకాశం అని తెలిపారు.

ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఎంఎడ్ (మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్) నాలుగవ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డి. సురేష్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. పరీక్షలు తేదీ 28 ఆగస్టు నుంచి 3 సెప్టెంబరు వరకు జరగనున్నట్లు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో, లేదా కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

నాందేడ్- తిరుపతి ప్రత్యేక రైలు పొడిగింపు

వచ్చే ఏడాది మార్చి 28 వరకు

రెగ్యులర్ చేసి, తిరువణ్ణామలై వరకు పొడిగించాలంటున్న ప్రయాణికులు

పెద్దపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జంక్షన్ మీదుగా నడిచే 07015/16 నాందేడ్ నుంచి తిరుపతికి, అక్కడి నుంచి నాందేడ్‌కు నడుస్తున్న ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను వచ్చే ఏడాది మార్చి 28 వరకు (7 నెలలు) పొడిగించారు. ఇప్పటికే కరీంనగర్ నుంచి తిరుపతికి బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఆది, గురువారాల్లో నడుస్తున్నది. దీనికి తోడు ఈ నెలలో నాందేడ్ నుంచి తిరుపతి వరకు దక్షిణ మధ్య రైల్వే వారానికి ఒక రోజు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను నడి పిస్తున్నారు.



ఈ రైలు తిరుపతికి వెళ్లే టప్పుడు పెద్దపల్లి జంక్షన్‌కి ప్రతీ శనివారం రాత్రి 10 గంటలకు వస్తుంది. 07016 తిరుపతి నుంచి నాందేడ్ వైపు వెళ్లేటప్పుడు ప్రతీ సోమవారం పెద్దపల్లి జంక్షన్‌కు ఉదయం 8:35 గంటలకు చేరుకుంటుంది. తిరుపతి, శ్రీకాళహస్తి, విజ యవాడ, బాసర వెళ్లే భక్తులు, ప్రయాణికులు ఈ రైలు ఎంతగానో వినియోగించుకుంటున్నారు. దీనిని ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలుగా కాకుండా రెగ్యులర్ రైలుగా మార్చి వారానికి కనీసం మూడు రోజులు నడిపిస్తే ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుంది. అలాగే ఈ రైలుకు పెద్దపల్లి నుంచి నిజామాబాద్ సెక్షన్ పరిధిలోని కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు వేలాది మంది భక్తులు వెళుతున్నందున తిరువణ్ణామలై రైల్వేస్టేషన్ వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ

గణేశ్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాల టీఎస్‌కేసీ, స్టూడెంట్ ట్రైబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ ఇవ్వడానికి, ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి సంయుక్తంగా అవగాహన కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విద్యార్థులకు ఉపయోగకరమైన ఒప్పందాలను టీఎస్‌కేసీ ద్వారా కళాశాల కుదుర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. స్టూడెంట్ ట్రైబ్ ఆర్గనైజేషన్ రిసోర్స్ పర్సన్ స్నేహ రామినేని, కరీంనగర్ టీమ్ మెంబర్స్ రూపాలి, చంద్రకిరణ్, సుమిత్ పాల్గొని విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. దాదాపు 200 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ పి రాజేష్‌ను ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

నేటితో ముగిసిన ముహూర్తాలు

- 24 నుంచి భాద్రపద మాసం
- ఈ సారి సంపూర్ణ చంద్రగ్రహణం
- తిరిగి అక్టోబరు, నవంబరులో శుభకార్యాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు బుధవారంతో ముహూర్తాలు ముగిశాయి. 23వ తేదీతో శ్రావణ మాసం ముగిసి శూన్య మాసంగా చెప్పుకునే భాద్రపద మాసం 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ముహూర్తాలు లేకున్నా విఘ్నేశ్వర నవరాత్రులు, పలు వ్రతాలు భాద్రపదంలోనే వస్తాయి. పితృదేవతారాధన లకు అనుకూల మాసం కాగా విష్ణువుకు ప్రీతికర మాసమని శాస్త్రాలు, పురా ణాలు చెబుతున్నాయి. పూజలు, వ్రతాలతో విశేష ఫలితాలు పొంద వచ్చని పండితులు చెబుతున్నారు. సెప్టెంబరులో మహూర్తాల కరువు ఏర్పడగా అక్టోబరు 23 నుంచి నవంబరు 15 వరకు శుభముహూర్తాలు న్నాయి. సెప్టెంబరు 7న సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించనుంది.

● పండుగలివే

ఆగస్టు 27 వినాయక చవితి, సెప్టెంబర్ 7 చంద్రగ్రహణం, 15 వైష్ణవ కృష్ణాష్టమి, 21 మహాలయ అమావాస్య (పెతరామాస) -బతుకమ్మ వేడుకలు ప్రారంభం, 22 శరన్న వరాత్రులు ప్రారంభం, 29 మూలా నక్షత్రం, 30 దుర్గాష్టమి, అక్టోబరు 1 మహర్నవమి, 2 విజయదశమి, 19 ధనత్రయోదశి, మంగళ హారతులు, 20 దీపావళి-ధనలక్ష్మీ పూజలు

● శుభ ముహూర్తాల తేదీలు ఇవే...

అక్టోబరులో 24, 26, 29, 30, 31 తేదీలు. నవంబరులో 1, 7, 8, 13, 15 తేదీలు.

వేములవాడలో రద్దీ..

రాజన్నను దర్శించుకున్న కేసీఆర్ సతీమణి శోభ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

రాజరాజేశ్వర స్వామివారికి ఆర్ద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారికి ఉదయం 5.30 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన చేపట్టారు. సాయంత్రం 6.05కు స్వామి వారి కల్యాణ మంటపంలో సదస్యను చేపట్టారు.



కేసీఆర్ సతీమణికి రాజన్న చిత్రపటం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజన్న సేవలో కేసీఆర్ సతీమణి..

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని మాజీ సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయానికి మనుమడు హిమాన్షుతో (కేటీఆర్ తనయుడు) కలిసి వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పూల మొక్క లు అందజేశారు. అనంతరం రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయాధికారులు ప్రసాదాన్ని అందజేశారు.



బద్ది పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో క్యూలైన్‌లో భక్తులు

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు

శ్రావణ మాస మంగళవారం సందర్భంగా వేములవాడ బద్ది పోచమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తి న బోనాలతో భక్తులు అమ్మవారి దర్శనం కోసం సుమారు 5 గంటలు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు భక్తులు వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

విత్తన గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు



విత్తన గణపతులను అందజేస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విత్తన గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని తన నివాసంలో విత్తన గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేనలో భాగంగా విత్తన గణపతులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిమ్మశెట్టి విజయ్, నీరటి మల్లేశం, నరాల శేఖర్, నీలం శేఖర్, గొస్కుల రవి, సిరిగిరి రామచంద్రం గుడిసే సదానందం తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు అజయ్..



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పీ అజయ్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల వాలీబాల్ అకాడమీ (శాట్) చెందిన విద్యార్థి పీ అజయ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన అండర్-15 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు నుంచి సిరిసిల్ల వాలీబాల్ అకాడమీకి చెందిన కే సంజయ్, నిఖిల్, పీ అజయ్ ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్రస్థాయి పోటీలో పీ అజయ్ ప్రతిభను కనబరిచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ జట్టు నుంచి మహారాష్ట్రలోని పూణే బాలే వాడి స్టేడియంలో ఈనెల 26,27 రెండు రోజుల పాటు జరిగే జాతీయ వాలీ బాల్ పోటీలలో పీ అజయ్ పాల్గొంటున్నాడు. అజయ్‌ను జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, కోశాధికారి కోడం శ్రీనివాస్, సిరిసిల్ల వాలీబాల్ అకాడమీ కోచ్‌లు సంపత్, జగన్మోహన్ అభినందనాలు తెలిపారు.

పల్లె ఓటరు జాబితా రెడీ

(5వ పేజీ తరువాయి)

మహిళలే 1,78,553 మంది ఉన్నారు. పురుషులు 1,67,686 మంది ఉన్నారు. మహిళలే అధికంగా 10,867 మంది ఉన్నారు.

రిజర్వేషన్లపైనే ఆసక్తి..

హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తుండడంతో జిల్లాలోని ఆశావహులు రిజర్వేషన్లపైనే ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని భావించిన ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. రిజర్వేషన్లు ఎలా ఉన్నా పల్లెల్లో పట్టు సాధించే దిశగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలోకి చెందిన ఆశావహులు పల్లెబాట పట్టారు. తమ మద్దతుదారులను అప్రమత్తం చేస్తున్నారు. పోటీల్లో ఉంటున్నట్లుగా ఆశావహులు మద్దతు కూడగట్టు కోవడంతో పల్లెలు ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచులకు 30గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించారు. సర్పంచ్‌లకు సంబంధించి పింక్ రంగు, వార్డుసభ్యులకు తెలుపురంగు బ్యాలెట్‌పత్రాలను సిద్ధం చేస్తున్నారు.

బీజేపీ ఎంపీలు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాములునాయక్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి యూరియా సరఫరాకు కృషి చేయాలని ఏఎంసీ చైర్మన్ రాములునాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని మార్కెటు కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రైతుల పట్ల చిత్తశుద్ధి లేకపోవడంతో తెలంగాణలో యూరియా అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారని అన్నారు. వీర్నపల్లి మండలానికి 900 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా ఇప్పటి వరకు కేవలం 372 టన్నులు సరఫరా అయిందని పేర్కొన్నారు. సకాలంలో ఎరువు లభించకపోవడం వల్ల రైతులు గోదాంలు, దుకాణాల వద్ద బారులు తీర్చాల్సిన దుస్థితి దాపురిస్తోందని అన్నారు. బీజేపీ ఎంపీ స్పందించి యూరియాను సరఫరా చేసేందుకు పాటు పడి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని రాములునాయక్ కోరారు. సమావేశంలో డైరెక్టర్లు దేవయ్య, నర్సింగం, మదన్‌లాల్, చంద్రమౌళి, యూత్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు కాంతయ్య, సంతోష్, లచ్చిరాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎగువ మానేరు వద్ద కాంగ్రెస్ నేతల పూజలు

గంభీరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు వద్ద కాంగ్రెస్ నేతలు మంగళవారం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మానేరు పరవళ్లను ఆసక్తిగా తిలకించి, గంగమ్మతల్లికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. అందుకే ప్రతి సంవత్సరం విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టు నిండి మత్తడి దూకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. యూరియా కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నాయకులు బదనాం చేస్తున్నారని, ప్రతి అంశాన్ని రాజకీయం చేయటంవారికి అలవాటైందన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, కొమరిశెట్టి తిరుపతి, రాంరెడ్డి, బండారి బాల్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇల్లంతకుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. తాళ్ళపెల్లి, తాళ్ళల్లపల్లె, వెంకట్రావుపల్లె, రేపాక, రహీంఖాన్‌పేట గ్రామాలలో మంగళవారం ఇటీవలే మృతిచెందిన వారి కుటుంబీకులను కలిసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట జడ్పీమజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు సాదుల్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దనపల్లి సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల/కళాశాలలో మిగిలిపోయిన సీట్లకోసం దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దర్శనాల పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 8, ఒకేషనల్ కోర్సు సీజీటీలో 63 ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. 2025 సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు.ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు బుధవారం హాజరుకావాలని సూచించారు.

నిర్వాసితుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్‌ను కలిసిన సంకెపల్లి గ్రామ నిర్వాసితులు

వేములవాడ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంలోని ఆయా గ్రామాల నిర్వాసితుల పెండింగ్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం సంకెపల్లి గ్రామానికి చెందిన నిర్వసితులు కాంగ్రెస్ జిల్లా నాయకులు చింతపల్లి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్‌ను కలిశారు. ఈసందర్భంగా గ్రామంలో 45మందికి ఇండ్ల పరిహారం అందించాలని ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సంకెపల్లి గ్రామానికి చెందిన పెండింగ్‌లో వున్న అర్హులైన నిర్వసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడానని అతి త్వరలో సమస్యను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి శ్రీనివాస్‌రావు, రగుడు పర్శరాములు, మారవేని రాజ్‌కుమార్ గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్యతోపాటు సింగిల్ విండో పాలకవర్గం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మంగళవారం కలిసి సన్మానించారు. సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య మాట్లాడుతూ విండో పాలకవర్గాన్ని ఆరు నెలల పాటు ప్రభుత్వం పొడిగించడంపై సంతోషం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సన్మానించామన్నారు. అంతేకాకుండా సింగిల్ విండో అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిధుల మంజూరుకు హామీ..

కోనరావుపేట మండలం సుద్దాల రజక సంఘ భవన నిర్మాణానికి వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య తెలిపారు. సుద్దాల రజక సంఘం నాయకులు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసంలో కలిసి రజక సంఘానికి నిధులు మంజూరు చేయాలని కోరడంతో హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సుద్దాల రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన పద్ధతుల ద్వారా బోధించాలి



ఇల్లంతకుంటలో బోధనోపకరణాలను పరిశీలిస్తున్న అధికారులు



ధర్మారంలో టీఎల్ఎం మేళాను పరిశీలిస్తున్న ఎంఈవో

ఇల్లంతకుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) ఉత్తమమైన విద్యార్థులను తయారుచేయడానికి మెరుగైన భోదనా పద్ధతుల ద్వారా విద్యను భోదించాలని తహసీల్దార్ ఫారూఖ్ సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం టీఎల్ఎమ్ మేళాను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు ప్రయోగాత్మకంగా బోధించడం ద్వారా ఎక్కువ కాలం గుర్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగయ్యాయన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. మేళాలో 28ప్రాథమిక పాఠశాలలు, 4ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌తో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పావని, తిరుపతి, రమణారెడ్డిలతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని మండల విద్యాధికారి మురళి నాయక్ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొని మాట్లాడుతూ టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన వస్తువులను విద్యార్థులకు బోధించారు. వివిధ రకాలుగా తయారుచేసిన టీఎల్ఎం పరికరాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, రాజేశం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : విద్యార్థులు కనీస అభ్యసన స్థాయిలో సాధించేలా బోధనాభ్యసన సామగ్రి దోహదం చేస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనోపకరణాల మేళా ఆకట్టుకుంది. 32పాఠశాలల ఉపాధ్యాయులు సామగ్రితో సృజనాత్మకంగా 500 బోధనోపకరణాలను తయారు చేసి ప్రదర్శించారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, వివిధపార్టీల నాయకులు తిలకించారు. జిల్లా స్థాయి పోటీలకు 10 ప్రదర్శనలను ఎంపిక చేశామని ఎంఈవో కృష్ణహరి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మనోహరచారి, మధుమాలతి, కృష్ణహరి, హెచ్‌ఎంలు చంద్రశేఖర్, మురళీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిలకిస్తున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంఈవో కృష్ణహరి తదితరులు

వినాయక ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు - డీజే నిర్వాహకుల బైండోవర్



డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన డీజే నిర్వాహకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక మంటపాలు, నిమజ్జన సమయంలో డీజేలను పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసుల సూచనలను పట్టించుకోకుండా డీజేలను ఏర్పాటు చేస్తే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీజే నిర్వాహకులను స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఉన్నారు.

● చందుర్తి : రాబోయే గణేష్ నవరాత్రులు శాంతియుతంగా జరుపుకోవాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన డీజే నిర్వాహకులను మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల నిర్వాహకులకు డీజే సౌండ్ సిస్టంను అద్దెకు ఇవ్వకుండా ముందుజాగ్రత్తగా బైండోవర్ చేశామన్నారు. నిబంధనలు ఉల్లగించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజే యజమానులు కౌన్సిలింగ్‌లో ఇచ్చిన హామీని పాటించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో స్మైల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఫోటోగ్రఫీ డే వేడుకలను నిర్వహించారు. ముందుగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యూరే చిత్రపటానికి అసోసియేషన్ సభ్యులు పూలతో నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. స్మైల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బోడ రవి, కోశాధికారి సురేష్‌గౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సబ్బని ప్రకాష్, ప్రధాన కార్యదర్శి లక్కం శేఖర్, కోశాధికారి సాప సుధాకర్, సభ్యులు బాలకృష్ణ, సురేష్, శ్రీకాంత్, బాబు, భరత్, కృష్ణ, విజయ్, సందీప్, దేవేందర్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. ప్రభాకర్‌రెడ్డి, అజిమొద్దిన్, తిరుపతి, ఫక్రుద్దిన్, షాదుల్, కుబేరస్వామి, నర్సింహాచారి, దయాకర్, రాజు, కృష్ణ, శంకర్, శ్రీధర్, బంటి, శివ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం కేక్‌కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు. మండల సంఘ అధ్యక్షుడు గూడ బాబు, సంఘ నాయకులు గుర్రాల మోహన్, మఠం తిరుపతి, పిట్టల యాదగిరి, ఎంప్ర రాజు, మ్యాక శ్రీధర్, సార్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం మంగళవారం మండల ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు రాపల్లి గంగాధర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ బత్తుల ఉదయ్ కుమార్, గౌరవ అధ్యక్షులు సురేష్, లింగయ్య, రాంప్రసాద్, శ్రీకాంత్, రమేష్, సుభాష్,"సుదీర్‌లు పాల్గొన్నారు.

బోరుబావికి మోటార్, పైపులైన్ ఏర్పాటు

తంగళ్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామ పరిధిలోని చింతలపల్లె గ్రామంలో బోరుబావికి మోటార్, పైపులైన్ ఏర్పాటుచేయడంతో తాగునీటి ఎద్దడి తీరింది. గత నాలుగు సంవత్సరాలుగా బోరు బావికి మోటర్ లేక నిరుపయోగంగా ఉండగా మాజీ సర్పంచ్ పొన్నం లక్ష్మణ్ గౌడ్ అధికారులతో దృష్టికి తీసుకువెళ్లి మోటార్,పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. దీంతో తాగునీటి సమస్య తీరడంతో స్థానిక ప్రజలు పొన్నం లక్ష్మణ్‌తో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకార వేతనాల దరఖాస్తుల ఆహ్వానం

చందుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలంలోని బీడీ వర్కర్స్ విద్యార్థుల ఉపకార వేతనాలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రాధ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఉదయం 11గంటలకు ఉపకార వేతనాలపై దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని బీడీ వర్కర్స్, టీకే దార్లు డాక్యుమెంట్స్‌తో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కూలి పెంచాలని ధర్నా

తంగళ్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కులో కార్మికులు కూలి పెంపు కోసం సమ్మెకు దిగారు. మంగళవారం టెక్స్‌టైల్ పార్కులో కార్మికుల సమావేశం అధ్యక్షుడు కూచన శంకర్ అధ్యక్షతన జరిగింది. టెక్స్‌టైల్ పార్కులో ప్రభుత్వ, ప్రైవేట్ వస్త్రాలకు సంబంధించి యజమానులు కూలి పెంచే వరకు పనులకు వెళ్లేది లేదని తీర్మానించారు. అనంతరం పార్కులో ర్యాలీ నిర్వహించి పార్కు ప్రధాన ద్వారం వద్ద ధర్నకు దిగారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ వారికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సదానందం, సంపత్, శ్రీనివాస్, కిషన్, శ్రీకాంత్, అంజనేయులు, రామచంద్రం, వేణు, వెంకటేశం, అంబదాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేంద్ర ప్రభుత్వం కుట్ర..

తంగళ్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాలో కోత విధించి రైతులపై కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండల కాంగ్రెస్‌అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత సృష్టిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. రైతుల పక్షాన కేంద్రాన్ని నిలదీయడానికి చలో ఢీల్లీ కార్యక్రమానికి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాలో కొరత సృష్టిస్తు రాష్ట్ర రైతాంగంపై వివక్ష చూపిస్తున్నరన్నారు. రాష్ట్రానికి 9లక్షల మెట్రిక్ టన్నుల యూరయా రావాల్సి ఉండగా కేవలం 5లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే బిజెపి నాయకులు స్పందించకపోవడం శోచనీయం అన్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటసాగు శాతం పెరిగిందన్నారు. యూరియా పక్క దారి పట్టకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. భవిష్యత్తులో యూరియా పంపిణీ టోకెన్ ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నహాలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, లింగాల భూపతి, తిరుపతిరెడ్డి, ఆరేపల్లి బాలు, పొన్నాల పర్శరాం, బాలసాని శ్రీనివాస్, మల్లేశం, లక్ష్మిరాజం, సాయిప్రసాద్, తిరుపతి, భరత్ గౌడ్, కిషన్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

గంభీరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదలచేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర బీఆర్ఎస్‌వీ నేత కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రవిగౌడ్ మాట్లాడారు. ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంటును విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. అలాగే గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనల్లో విద్యార్థులు కొందరు మృతిచెందడం, మరికొందరు ఆసుపత్రుల పాలవడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణమే అన్నారు. విద్యాశాఖను సీఎం దగ్గరు ఉంచుకుని విద్యాశాఖపై ఒక్కసారైన సమీక్ష సమావేశాలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పెద్దలు తరచూ ఢిల్లీకి వెళ్లడం తప్ప విద్యసమస్యలు పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌వీ మండల నాయకులు వివంత్, హర్షవర్ధన్, అక్షయ్‌నారాయణ, సతీష్, దనుష్ శ్రీకాంత్, విష్ణు భాస్కర్ ఉన్నారు.

కాంగ్రెస్ చేరిన ప్యాక్స్ చైర్మన్



పీసీసీ అధ్యక్షుడి సమక్షంలోకాంగ్రెస్‌లో చేరుతున్న ప్యాక్స్‌చైర్మన్ అనంతరెడ్డి

ఇల్లంతకుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) మండలంలోని గాలిపెల్లి సహకార సంఘ అధ్యక్షుడు అన్నాడి అనంతరెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హైద్రాబాద్‌లో కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ విజయానికి కృషిచేస్తానని అనంతరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

తులసీ దళాల అలంకరణలో అమ్మవారు...

ఇల్లంతకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని గంగాధర ఆలయంలో శ్రావణమాసపు చివరి మంగళవారంను పురస్కరించుకొని అమ్మవారిని తులసీ దళాలతో అలంకరించారు. ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సామహిక కుంకుమపూజలు జరిగాయి. వివిధ గ్రామాల మహిళలు పూజలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగరాజుశర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలకు యువజన సంఘాల సభ్యులు సిద్ధమవుతున్నారు. భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని యువజన సంఘం సభ్యులు నిజామాబాద్ జిల్లా పర్కెట్ గ్రామంలో తయారు చేసిన 18ఫీట్ల ఎత్తు కలిగి ఏకదంతుడిని ప్రత్యేక వాహనంలో కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డిపేట మీదుగా సిరిసిల్లకు తరలిస్తున్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేటలో ఆదిదేవుడిని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మూడు రోజుల కిందట పర్కెటు గ్రామం నుంచి బయలుదేరామని ఇంకో రోజులో సిరిసిల్లకు చేరుకుంటామని సభ్యులు పేర్కొన్నారు.

సున్నపు రాళ్లే.. ప్రమాద హెచ్చరిక బోర్డులు..



అల్మాస్‌పూర్ శివారులో కోతకు గురైన రోడ్డు వద్ద ఉంచిన సున్నం రాళ్లు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, అల్మాస్‌పూర్ గ్రామ శివారులో గత యేడాది కురిసిన భారీ వర్షాలకు వంతెనల వద్ద రహదారులు కోతకు గురయ్యాయి. నిత్యం వందల సంఖ్యలో అటవీ గ్రామాలకు ప్రయాణించే రోడ్డుపై ఆ ప్రాంతాలు ప్రమాదకరంగా మారాయి. మరమ్మత్తులు చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు కోతకు గురైన ప్రదేశాల్లో సున్నం వేసిన బండరాళ్లను ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనాలపై చీకటి సమయంలో ప్రయాణిస్తే దగ్గరకు వచ్చే వరకు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సున్నపు రాళ్లే.. ప్రమాద హెచ్చరిక బోర్డులుగా ఏర్పాటుచేశారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కోతకు గురైన రహదారుల వద్ద మరమ్మత్తు పనులు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.